## క్లుప్తంగా

### పోరాడితేనే మహిళలకు రక్షణ

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



సదస్సులో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

విజయనగరం ఫూల్‌బాగ్: తెగించి పోరాడితేనే మహిళలకు రక్షణ లభిస్తుందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. ఐద్వా, సీఐటీయూ, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక కలెక్టరేట్ నుంచి కేఎల్ పురంలో ఉన్న ప్రజా సంఘాల కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రామిక మహిళా సంఘ కన్వీనర్ వి. లక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. పురుషాధిక్యత పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. పని చేసే ప్రదేశాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పని ప్రదేశాల్లో ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గానీ మహిళలపై వేధింపులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు రెడ్డి మోహనరావు, బి.పైడిరాజు, కె. సురేష్, బి.రమణ, రమేష్ పట్నాయక్, జేఏవీఆర్‌కే ఈశ్వరరావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

### అవినీతి రహిత పాలన అందించాం

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



కొత్తూరులో రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవినీతి రహిత, సంక్షేమ పాలన అందింస్తోందని, ఇచ్చిన హామీలన్నీ సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి అమలు చేశారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఎస్.కోట తలారి గ్రామంలో సచివాలయ నూతన భవనం, గోపాలపల్లిలో సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను, కొత్తూరులో రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా సాయం అందించామని, ఎక్కడా ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా, దళారీలు, అవినీతి లేని ప్రభుత్వాన్ని జగనన్న నడిపారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబులా అబద్ధాలు, మాయమాటలు చెప్పడం సీఎం జగన్‌కు తెలియదన్నారు. మంచిచేసింది ఎవరో, మోసం చేసింది ఎవరో గుర్తించాలని ప్రజలకు సూచించారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రంది అరుందతి, చిట్టిపాల లక్ష్మి, ఎంపీటీసీలు ఎం.వి.దుర్గాప్రసాద్, గుమ్మడి సన్యాసప్పడు, రాపర్తి రామచంద్రరావు, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, నాయకులు రంధి అనంత్, చిట్టిపాల సత్తిబాబు, వాకాడ రాంబాబు, మోపాడ కుమార్, కె.వెంకటరావు, జుత్తాడ సూర్యారావు, ఆవాల కృష్ణ, చింతల మూర్తి, ఎలమంచిలి ఈశ్వరరావు, వసి బంగారు నాయుడు, ఉల్లి శంకర్ పాల్గొన్నారు.

### జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు గ్రామంలో ఎర్రయ్యమ్మ పేరంటాల తీర్థం సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వ ర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈటోర్నమెంట్‌ను వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ ఇన్‌చార్జి యడ్ల కిశోర్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. పోటీల్లో 30 జట్లు పాల్గొననున్నాయని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ విజేతకు రూ.10 వేల నగదు బహుమతి, రన్నర్‌కు రూ.6 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.3వేల నగదు బహుమతి, బెస్ట్ బౌలర్, బ్యాట్స్‌మెన్, ఆల్ రౌండర్‌కు ప్రత్యేక బహుమతులు అందచేస్తామని చెప్పారు.

### రూ.5 లక్షల బీమా చెక్ అందజేత



మృతుడి కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న నాయకులు

చీపురుపల్లి: మండలంలోని పత్తికాయవలస గ్రామానికి చెందిన మీసాల కృష్ణ ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్‌బీమా పథకంలో భాగంగా రూ.5 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్‌ను బాధి తుడి కుటుంబ సభ్యులకు పత్తికాయవలసలో ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ సువ్వాడ అప్పల నాయుడు, నాయకులు బి.టి.ఆర్.యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# లో ఓల్టేజ్ సమస్యకు చెక్

- సతివాడ సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
- నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు



సతివాడ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటైన 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. సబ్‌స్టేషన్ పరిధిలో సుమారు 20 గ్రామాలు ఉండడంతో విద్యుత్ సరఫరాలో అప్పుడప్పుడు స్వల్ప అంతరాయం ఏర్పడేది. ఈ నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా సుమారు కోటి రూపాయల నిధులతో సబ్‌స్టేషన్‌లో అదనంగా 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు సబ్‌స్టేషన్‌లో ఒక పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మాత్రమే అందుబాటులో ఉండేది. పరిధి ఎక్కువ కావడంతో ఆయా గ్రామాల్లో తరుచూ విద్యుత్ సమస్యలు తలెత్తేవి. సమస్యను గుర్తించిన అధికారులు మరో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.

**గ్రామాల్లో మినీ ట్రాన్స్‌ఫార్మర్లు..**

విద్యుత్ వినియోగం భారీగా పెరగడంతో పలు గ్రామాల్లో లో ఓల్టేజ్ సమస్య వేధిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మల్యాడ, ఒమ్మి, అలుగోలు, జోగిరాజుపేట, గుషిణి, బొప్పడాం, వల్లూరు, పారసాం, సారిపల్లి, తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తరుచూ ఏర్పడేవి. ఒక వీధికి సరఫరా ఉంటే మరో వీధికి విద్యుత్ ఉండని పరిస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తుప్పుపట్టిన ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టింది. తాజాగా వల్లూరులో 16కేవీ, తాళ్లపూడిపేటలో 16 కేవీ, పారసాంలో 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. సారిపల్లి గ్రామానికి 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కాగా మరో వారం రోజుల్లో గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**నిరంతరాయంగా విద్యుత్..**



సతివాడ సబ్‌స్టేషన్‌లో అదనంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం మంచిదే. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కావు. ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో విద్యుత్ సమస్యలు తలేత్తేవి. నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం సంతోషం. సుమారు 20 గ్రామాలకు ప్రయోజనకరం.

– మజ్జి చిన్నంనాయుడు, సతివాడ గ్రామం

**నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు..**



వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరాకు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే సతివాడ సబ్‌స్టేషన్ లో అదనంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నాం. సబ్‌స్టేషన్ నుంచి ఆరు 11 కేవీ ఫీడర్లతో పాటు గుర్ల మండలంలోని ఒక 11 కేవీ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా అవుతోంది. దీంతో అప్పుడప్పుడు చిన్న చిన్న సమస్యలు ఏర్పడుతున్నాయి. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో ఇకపై సమస్య ఉండదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లో ఓల్టేజ్ సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తాం.

– పిచ్చయ్య, విద్యుత్ ఏఈ, నెల్లిమర్ల మండలం

## సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: గడిచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు సూచించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే అప్పలనాయుడు 'నేను సిద్ధం – నా బూత్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులోభాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధితో పాటు సచివాలయ, వలంటర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ఇంటి ముంగిటకే చేరుస్తున్నారన్నారు. అంతేకాకుండా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటి వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగితెలుకుని పరిష్కరించినట్లు చెప్పారు. మరో యాభై రోజుల్లో రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పడాల భానుప్రకాష్, పడాల శ్రీనివాసరావు, దంతులూరి రావాడబాబు, బైరెడ్డి ఎర్రప్పలనారాయణ, సుందర హరీష్, రమేష్‌రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రభుత్వ భవనాలు ప్రారంభం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు సోమవారం జరగనున్నాయి. తంగుడుబిల్లి గ్రామంలో వెల్‌నెస్, రైతుభరోసా కేంద్రాలు.. సతివాడలో రైతుభరోసా కేంద్రం.. అలుగోలులో కమ్యూనిటీ స్టేజ్ ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నూతన ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది భాగస్వామ్యం కావాలని కోరారు.

## జరజాపుపేటలో రక్తదాన శిబిరం



రక్తదాతలను అభినందిస్తున్న సాధన యువజన సంఘ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు

నెల్లిమర్ల: జరజాపుపేటలో సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, అలుమల్లు మాధవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రక్తదానంపై అపోహలను విడనాడాలన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాతలు పోలుభోతు సంతోష్, నల్లి రాధాకృష్ణ, పి. ఆనంద్, మద్దిల రాజు, అడపా రమేష్, కేటరింగ్ ప్రకాష్, బొద్దల పవన్, కేబుల్ ఆపరేటర్ కె. ప్రసాద్, రామోజీ, మణికంఠ స్వామి, బాల మహేష్, తదితరులను అభినందించారు. కార్యక్రమంలో సాధన సభ్యులు తుమ్ము అశోక్, హరి రాజారావు, కనకల సురేంద్ర, మద్దిల ఉమా, పడాల హరికృష్ణ, చాపా హరి, మద్దిల కల్యాణ్, మద్దిల ప్రసాద్, పోలుభోతు నారాయణరావు, ఎం.మోహన్, రక్తనిధి సిబ్బంది డాక్టర్ శైలజ, అప్పలనాయుడు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

### మద్యం బాటిళ్లు స్వాధీనం

భోగాపురం: మండలంలోని కొల్లుపేట గ్రామం వద్ద ఆదివారం ఉదయం వాహన తనిఖీలు చేపడుతున్న సమయంలో కొల్లిపేట గ్రామానికి చెందిన కొలుసు సన్యాసమ్మ నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సూర్యకుమారి తెలిపారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# ఇంటింటికీ జల్ జీవన్ కుళాయిలు

- తీరనున్న తాగునీటి కష్టాలు
- శరవేగంగా వాటర్ ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం
- మరిన్ని గ్రామాలకు పథకం వర్తింపు
- రూ.40 కోట్లతో పనులు



చెరువుకొమ్ము గొల్లపేటలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు



పైపులైన్ వేస్తున్న కూలీలు

భోగాపురం: ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటే లక్ష్యంగా గ్రామాల్లో జరుగుతున్న జల్ జీవన్ మిషన్ (జేజేఎం) మరిన్ని గ్రామాలకు చేరువకానుంది. మండలంలోని తొలివిడతలో 80 గ్రామాల్లో.. మలి విడతలో 84 గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. ఇంటింటికీ కుళాయి ఏర్పాటులో భాగంగా పైపులైన్లు, నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అవసరమైన చోట ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. తాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం రూ. 40 కోట్ల నిధులు మంజూరు చేయడంతో గ్రామాల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి. మండలంలోని మొత్తం 22 గ్రామ పంచాయతీల్లో (164 గ్రామలు) 360 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేయడంతో పాటు 16 ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నారు. మొదటి దశలో 80 గ్రామాల్లో 150 కిలోమీటర్ల మేర పైపులైన్ వేయడంతో పాటు చెరువుకొమ్ము గొల్లపేటలో 20 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు, భోగాపురం ఎస్సీ, బీసీ కాలనీలో 30 వేల లీటర్ల వాటర్ ట్యాంకు, ముంజేరు ఎస్సీ కాలనీలో 20 వేల లీటర్ల వాటర్ ట్యాంకులు నిర్మించారు. రెండో విడతలో 84 గ్రామాలకుగాను 200 కిలోమీటర్ల మేర పైపులైన్‌తో పాటు దల్లిపేట, జమ్మయ్యపేట, ముగడపేట, తోటపల్లి, రాజాపులోవ, ముక్కాం, కొంగవానిపాలెం, ఎరుసుపేట, చినరావాడ, గాలిపేట, సుందరపేట, కొండ్రాజుపాలెం, కారిగొల్లపేట, భోగాపురం, గుడివాడ గ్రామాల్లో 30 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించనున్నారు.

**మూడు నెలల్లో పనులు పూర్తి ...**



మొదటి, రెండవ దశ పనులన్నీ మరో మూడు నెలల్లో పూర్తి చేస్తాం. ఈ పనులను టెండర్ల ద్వారా దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు చేపడుతున్నారు. దాదాపు 60 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు తాగునీరు అందిస్తాం.

– వైకుంతరావు, డీఈ, గ్రామీణ నీటి పారుదల శాఖ విభాగం, భోగాపురం మండలం

## • నాడు వెలవెల.. నేడు కళ కళ..



నాడు : వెలవెలబోతున్న సంగీత కళాశాల భవనం



నేడు : ఆకర్షణీయంగా మారిన సంగీత కళాశాల

జిల్లా కేంద్రంలో ఉన్న సంగీత, నృత్య కళాశాలకు దేశంలోనే విశిష్ట స్థానం ఉంది. ఘంటసాల వెంకటేశ్వరరావు లాంటి ఎందరో మహానుభావులు ఇక్కడ సంగీతం నేర్చుకుని ప్రపంచ ప్రసిద్ధి చెందారు. అటువంటి కళాశాల గత టీడీపీ హయాంలో వెలవెలబోయింది. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కళాశాలను అన్ని విధాలా అభివృద్ధి చేయడంతో కళకళలాడుతోంది. విద్యార్థులు, బోధకులకు అన్ని సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించడంతో పాటు భవనానికి రంగులు వేయడంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

## • మేము కూడా సిద్ధమే..



బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఆదివారం నిర్వహించిన సిద్ధం సభను స్థానిక వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు లైవ్‌లో తిలకించారు. పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు నివాసంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌లో ముఖ్యమంత్రి ప్రసంగాన్ని అత్యంత ఆసక్తిగా విన్నారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులున్నారు. – డెంకాడ

## బ్యాంకింగ్ సేవలు కీలకం

- ఎస్‌బీఐ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రాంతీయ కార్యదర్శి నెప్రూ




మాట్లాడుతున్న ఎస్‌బీఐ పెన్షనర్ల అసోసియేషన్ ప్రాంతీయ కార్యదర్శి నెప్రూ



సమావేశానికి హాజరైన రిటైర్డ్ ఉద్యోగులు

విజయనగరం అర్బన్: బ్యాంకింగ్ రంగంలో అధికారులు, ఉద్యోగులు చేసే విధులు దేశ ఆర్థిక సేవలు మాత్రమే కాదని.. మానవ అభివృద్ధికి కీలకంగా నిలుస్తాయని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెన్షనర్ల అసోసియేషన్ ప్రాంతీయ కార్యదర్శి నెప్రూ అన్నారు. అసోసియేషన్ జిల్లా కమిటీ పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల ఆర్థిక అవసరాలకు వారధిగా నిలిచిన సిబ్బంది నిజంగా అభినందనీయులన్నారు. విధుల్లో ఉన్నపుడు మాదిరిగానే పదవీవిరమణ తర్వాత కూడా ఉద్యోగ, అధికారులంతా ఐక్యంగా ఉండాలని పిలునిచ్చారు. పెన్షనర్ల సమస్యలు ఎదుర్కొనడానికి ఐక్యత ప్రదర్శించాలని సీనియర్ రిటైర్డ్ అధికారి బ్రహ్మ, పులువురు ఉద్యోగ, అధికారులు పిలుపునిచ్చారు. అనంతరం సీనియర్ ఉద్యోగులను సత్కరించారు. సంఘ మాజీ ప్రాంతీయ కార్యదర్శులు రామానుజరావు, జీఎస్ఎన్ రాజు, పేర్ల కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బాపయ్య పంతులు, కోటేశ్వరరావు, వైజాగ్ ప్రాంతీయ కార్యదర్శులు పంత్, పీజీ ప్రసాద్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వందమందికి పైగా సభ్యులు హాజరయ్యారు.